వినియోగంలోకి బోటు

ప్రజాశక్తి-అరకులోయ:అరకులోయ గిరిజన మ్యూజియంలో ఏర్పాటు చేసిన బోటులో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని మ్యూజియం అధికారులు ఆదివారం మరమ్మత్తులు చేయించారు. బోటులో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సవరించి పర్యాటకులకు ఆదివారం నుండి అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు మ్యూజియం మేనేజర్ మురళీకృష్ణ అన్నారు. పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా నాణ్యమైన బోటును కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. పర్యాటకులకు అసౌకర్యం కలగకుండా వెంటనే మరమ్మత్తులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన బోటు షికారు ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బోటులో విహరిస్తున్న పర్యాటకులు

జాలీగా.. హాలీడే..

చాపరాయి వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

కొత్తపల్లి జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి-అరకులోయ:పర్యాటక కేంద్రమైన అరకులోయకు ఆదివారం పర్యాటకులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో ఈ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి. ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో అరకులోయ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలైన గిరిజన మ్యూజియం, ఉద్యానవన కేంద్రం, కాఫీ మ్యూజియం వంటి సందర్శిత ప్రాంతాలు కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో అరకులోయ టౌన్ షిప్‌లో సందడి నెలకొంది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడ్డాయి. పోలీసులు ప్రధాన కూడలిలో విధులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు క్లియర్ చేయడంతో ప్రయాణికులు, పర్యాటకులు ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డు పక్కనే ఉన్న హోటల్స్‌లో పార్కింగ్ సదుపాయం లేక పోవడంతో పర్యాటకుల వాహనాలన్నీ రోడ్డుపైనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. మునుపెన్నడూ లేని విధంగా వాహనాలు, ద్విచక్ర వాహనాల్లో పర్యాటకులు తరలిరావడంతో రద్దీ ఏర్పడింది. మద్యం దుకాణాలన్నీ రోడ్డుపైనే ఉండడంతో మందు బాబులు వాహనాలన్నీ రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. బ్రాందీ షాపులు ఊరికి చివర్లో ఉంటే బాగుంటుందని స్థానికులు, పర్యాటకులు డిమాండ్ చేస్తున్నారు.

సందడిగా పర్యాటక ప్రాంతాలు

అరకులోయకు వస్తున్న వాహనాలు

పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆయా సందర్శిత ప్రాంతాల్లో ప్రవేశ రుసుం ద్వారా లక్షల్లో ఆదాయం సమకూరింది. పర్యాటకులు ఎక్కువమంది తరలి రావడంతో స్థానిక వర్తకులు కూడా ఆనందం వ్యక్తం చేశారు. హోటల్, లాడ్జిలు, క్యాంపింగ్ టెంట్లు, రిసార్ట్లు కిటకిట లాడాయి. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో రోడ్డు దాటడానికి పాత చారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చాపరాయిలో పర్యాటకుల తాకిడి

డుంబ్రిగుడ:ప్రముఖ పర్యాటక కేంద్రమైన మండలంలోని చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో మైదాన ప్రాంతం నుంచి పర్యాటకులు తరలివచ్చారు. పర్యాటకుల తాకిడితో చాపరాయి జలపాతం కిటకిటలాడింది. ఇక్కడ సందర్శించిన తిలకించి పర్యాటకులు చాపరాయి జలపాతంలో చిన్న పెద్ద తేడా లేకుండా సరదాగా జలకాలాడుతూ స్నానాలు చేస్తూ కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. గిరిజన సాంప్రదాయమైన దింసా నృత్య కళాకారులతో పర్యాటకులు ప్రదర్శిస్తూ ఆనందంగా గడిపారు. జలపాతంలో స్నానాలు చేసిన తర్వాత చాపరాయి నుంచి జైపూర్ జంక్షన్ వరకు రోడ్డు కిరువైపులానున్న చెట్టు నీడలో వనభోజనాలు చేస్తూ కుటుంబ సమేతంగా ఆటపాటలతో సందడి చేస్తూ ఆనందంగా గడిపారు. చాపరాయి జైపూర్ జంక్షన్‌కు మధ్యలో పంతల చింత, జంగిడి వలస రైల్వే గేట్ సమీపంలో నున్న పొద్దుతిరుగుడు పూల తోటలు పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తున్నాయి.

జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి వాటర్ జలపాతం ఆదివారం పర్యాటకులతో కిటకిట లాడింది. మైదాన ప్రాంతం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున పర్యాటకులు తరలి వచ్చారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ వాటర్ ఫాల్స్‌లో కేరింతలు కొట్టారు.

సిపిఎం కార్యకర్తకు పరామర్శ

రాజును పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- విఆర్.పురం: రేఖపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న సిపిఎం మండల కమిటీ నాయకుడు మామిడి రాజు స్వగృహానికి ఆదివారం సిపిఎం మండల కమిటీ నాయకులు వెళ్లి పరామర్శించారు. రాజు ఆరోగ్య పరిస్థితి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలోపార్టీ మండల కార్యదర్శి సంతోష్ కుమార్, నాయకులు పోడియం శ్రీరామమూర్తి పంకు సత్తిబాబు, సోయం చినబాబు, గుండెపూడి లక్ష్మణరావు, కమ్ముచిచ్చు సత్యనారాయణ, నాల్లరపు ప్రకాశరావు, సిహెచ్ సుబ్బారావు, చీరపు తాతాబాబురెడ్డి, వీర్ల నాగేశ్వరావుఉన్నారు..

ప్రశాంతంగా పిఎల్‌జిఎ వారోత్సవాలు

ఊపిరి పీల్చుకున్న సరిహద్దువాసులు, పోలీసులు

కూంబింగ్ నుంచి తిరుగుముఖం పడుతున్న పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు: ఈనెల 2 నుంచి 8 వరకు మావోయిస్టుల పిఎల్‌జిఎ వారోత్సవాలు ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఎటువంటి అలజడి లేకుండా ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పిఎల్‌జిఎ వారోత్సవాల జయప్రదానికి మావోయిస్టులు ముందుగానే పిలుపునివ్వడంతో ఎఒబిలో పోలీసులు పూర్తి అప్రమత్తమై మావోయిస్టు ప్రభావిత జికె.వీధి మండలం తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో కట్టు దిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. ఒడిశా, ఛత్తీసగడ్, తెలంగాణ సరిహద్దుల్లో వేలాదిమంది సాయుధ పోలీసులను మోహరించి విస్తృత గాలింపు, కూంబింగ్ చర్యలు చేపట్టారు. సరిహద్దు ప్రాంతంలోని వారపు సంతల్లో సిఆర్‌పిఎఫ్, స్పెషల్ పార్టీలతోపాటు లోకల్ పోలీసులును మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. అనుమానిత వ్యక్తులు, వస్తువులపై పటిష్టనిఘా పెట్టి గాలింపున చర్యలు చేపట్టారు. మన్యంలో మావోయిస్టు వారోత్సవాలకు ఆస్కారం లేకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు మన్యవాసుల్లో మావోయిస్టు చర్యలపై అవగాహన కల్పిస్తూ, ఏది అభివృద్ధో, ఎవరు విధ్వంసకారులో ఆలోచించాలని చైతన్యపరిచారు. పర్యావసానంగా మావోయిస్టులకు వ్యతిరేకంగా మన్యంలోని కొన్ని ప్రాంతాల్లో నిరసన ప్రదర్శలు, ర్యాలీలు కూడా జరిగాయి. గతంలో అక్కడక్కడా మావోయిస్టులు వారోత్సవాలను నిర్వహించిన దాఖలాలున్నప్పటికీ, ఈ ఏడాది అటువంటి అవకాశం ఇవ్వకుండా పోలీసుల పటిష్ట చర్యలు చేపట్టడంతో వారోత్సవాలు ప్రశాంతంగా ముగిసాయనే చెప్పాలి.

సాగు భూముల జోలికొస్తే తరిమికొడతాం

- సిపిఎం ఆధ్వర్యాన గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి:జీవన ఆధారమైన తమ సాగు భూములలో ప్రవేటు ఏకో టూరిజం ఏర్పాటును అడ్డుకుంటామని సీపీఎం ఆధ్వర్యాన గిరిజనులు సాగు భూమి వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీంపోలు పంచాయతీ సీపీఎం నాయకులు జేష్ట .వెంకటరమణ మాట్లాడుతూ, నందకోట రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.22-28 లో సాగులో ఉన్న రైతులకు ప్రభుత్వం డీ పట్టా మంజూరు చేసీందన్నారు. ఆ భూమి లో రైతులు జీడి, టేకు మొక్కలు నాటి ఫలసాయం పొందడమే కాకుండా వ్యవసాయ పంటలు పండించుకుంటు జీవనం సాగిస్తున్నారన్నారు. ఇదే భూమిలో గతంలో కూడా కొంతమంది ఏకో టూరిజం ఏర్పాటుకు ప్రయత్నిస్తే పోరాటం ద్వారా అడ్డుకున్నామని తెలిపారు. విజయనగరానికి చెందిన ఓ భూస్వామికి ప్రైవేటు టూరిజం పేరుతో రైతుల సాగు భూమి కట్టబెట్టేందుకు ప్రభుత్వం, కొంతమంది పెద్దలు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇందుకే శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా జేసి, పాడేరు సబ్ కలెక్టర్ పర్యటించి పరిశీలించారన్నారు. గత ప్రభుత్వం కూడా రమేష్ అనే భూస్వామికి ఈ భూమి అప్పుజెప్పాలని ప్రయత్నం చేసినపుడు రైతులతో కలిసి పోరాటం చేశామని గుర్తు చేశారు. నది పరివాహక ప్రాంతాల్లో ఎటువంటి కట్టడాలు చేయరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ ప్రభుత్వ పెద్దలతో లాభియింగ్ చేసి అక్రమంగా భూములు కొట్టేయడానికి రమేష్ చూస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేటు టూరిజం పేరుతో తమ సాగు భూములు ఇచ్చే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాగు రైతులు మూతిబోయిన. సింహాచలం, ఊడికి. సన్యాసి దేముడు, గొండ రాము, వనెపూరి. కన్నయ, వనెపూరి ఈశ్వరమ్మ, ఊడికి .సింహాచలం, మామిడి జగన్నాథరావు, జన్ని క్రిష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గిరిజనులు

రగ్గులు పంపిణీ చేస్తున్న అమ్మ ట్రస్టు సభ్యులు

గిరిజనులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని అనంతగిరి పంచాయతీ పరిది తాడిగుడ గ్రామంలో గిరిజనులకు ఆదివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన రగ్గులు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు కలిసి సుమారుగా 35 కుటుంబాలకు ఉన్నితో కూడిన రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ వెంకటరావు మాట్లాడుతూ, చలికాలంలో ప్రతీ ఒక్కరు ఈ రగ్గులును ఉపయోగించి చలి నుంచి రక్షణ పొంధాలని కోరారు. ఈ గ్రామాల్లో ఉన్న ప్రజలకు విద్య, ఆరోగ్యం అవసరాల నిమిత్తం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ సింగంపల్లి. అచ్చిబాబు, ఎల్. సత్యనారాయణ, దొగ్గ ఎరుకు నాయుడు, సచివాలయం సిబ్బంది గోపి, గిరిజనులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ చిన్నబాబు

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకువేలి మండలం సుంకరమెట్ట పంచాయతీ దండబాడు నుండి లింబాగుడ వరకు రెండు కిలోమీటర్ల డబ్ల్యూబిఎమ్ రోడ్డు పనులకు సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెల చిన్నబాబు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. గతంలో రెండు సార్లు ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేసినా పనులు పూర్తి కాలేదు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్నబాబు మాట్లాడుతూ, ఈ రోడ్డు దండబాడు నుండి లింబగుడా వరకు రెండు కిలోమీటర్లు రోడ్డు పూర్తి చేసినట్లయితే ఈ రెండు గ్రామాల ప్రజాలకే కాకుండా హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ ప్రజలకు కుడా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.తక్కువ కిలో మీటర్లలోనే అన్ని గ్రామాలకు అనుసంధానం చేసే ఈ రోడ్డును గుత్తేదారులు గతంలో చేసినట్టు శంకుస్థాపన వరకు పరిమితం చేయకుండా సకాలంలో పనులు పూర్తి చేసి రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రాజు, కేశవ్, బాబురావు, వార్డు మెంబర్ దేవన్న, రాము పాల్గొన్నారు.

కలుషిత ఊటనీరే గతి!

- అన్ని అవసరాలకు ఒకే వాగులోని నీరు
- మూలకు చేరిన సోలార్ నీటి పథకం
- అవస్థలు పడుతున్న బంధవీధి గిరిజనులు

అన్ని అవసరాలకు ఒకేచోట నీటిసి వినియోగిస్తున్న బంధవీధి గిరిజన మహిళలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బంధవీధి గ్రామ గిరిజనులు రక్షితమంచినీటికి అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని సోలార్ నీటిపథకం మూలకు చేరగా, సర్పంచ్ చొరవతో ఏర్పాటుచేసిన ప్రత్నామ్నాయ విద్యుత్ కనెక్షన్ మూణ్నాళ్ల ముచ్చట కావడంతో ప్రజలంతా కొండవైపునుంచి వచ్చే వాగులోని ఊటనీటినే అన్ని అవసరాలకు వాడుతుండంతో కలుషిత నీరే తాగక తప్పని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

దుప్పిలివాడ పంచాయతీ బంధవీధి గ్రామంలో 32 గిరిజన కుటుంబాలు వ్యవసాయం, రోజుకూలీల పనులతో జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో రక్షితనీటి సదుపాయం లేకపోవడంతో వీరికి కలుషిత ఊటనీరే గతిగా మారింది. గ్రామానికి సమీపాన ఉన ఎత్తైన కొండలపై నుంచి వచ్చే పిల్ల కాలువల్లోని ఊటనీటిని తాగడానికి, వంటకు, బట్టలు ఉతకడానికి, స్నానపానాదులు, ఇతర కాలకృత్యాలు, అన్ని అవసరాలకు వినియోగిస్తున్నారు. దీంతో నీరు కలుషిత నీరే గతై ఎటువంటి రోగాలు వస్తాయోనని బంధవీధివాసులు ఆందోళన చెందుతున్నారు.



కొండవాగులో నీటిని సేకరిస్తున్న గిరిజన బాలిక

మూలకు చేరిన సోలార్ నీటి పథకం

మూలకు చేరిన సోలార్ పథకం

కొన్నాళ్ల క్రితం గ్రామ సమీపంలో ఒక బోరుబావిని తవ్వి, సోలార్ పథకం ద్వారా ట్యాంకుల్లోకి నీటిని పంపి, అక్కడ కుళాయిలను ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందించారు. మూడు నెలలు క్రితం సోలార్ పథకం పాడవ్వడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. సమస్యను దుప్పిలివాడ సర్పంచ్ కేలబు కుమారి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి బోరు బావికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి మంచినీటి సౌకర్యం కల్పించారు.అయితే అది మూణ్నాళ్లముచ్చట కావడంతో మళ్లీ పాతకష్టాలేవచ్చాయని బంధవీధి గిరిజనులు అంటున్నారు.

గత్యంతరం లేక కొండవాగుల నీరే గతి

బంధవీధిలోని సోలార్‌పథకం పనిచేయక పోవడంతో కొండవాగుల్లోని ఊటనీటినే తాగుతున్నామని, అన్ని అవసరాలను ఒకేచోట చేపట్టడంతో నీరు కలుషితమయమౌతోందని గ్రామస్తులు ప్రజాశక్తి వద్ద వాపోయారు. సమస్యపై సర్పంచ్ స్పందించినా పూర్తి ప్రయోజనం చేకూరలేదని అంటున్నారు. అన్ని అవసరాలను తీర్చుకునే చోట నుంచే నీటిని సేకరించి తాగడం వల్ల రోగాలు వస్తాయేమోనని ఆవేదన చెందుతున్నారు..ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ ఇతర సంబంధిత అధికారులు దృష్టిసారించి, సోలార్ పథకాన్ని వినియోగంలోకి తేవడం ద్వారా తాగునీటి కష్టాలను తీర్చాలని వేడుకుంటున్నారు.

కుమారి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎస్ రాయవరం మండలం కురుప్రోలు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికురాలు ఏడిద కుమారి (40) శుక్రవారం పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా కుప్ప కూలి మృతి చెందారని, కుమారి కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని ఎపి పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.శివలక్ష్మి, పి.జానకి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శివలక్ష్మి, జానకి సిఐటియు జిల్లా కోశాధికారి వివి. శ్రీనివాసరావు మాట్లాడారు. శానిటేషన్ కార్మికులకు ఉద్యోగ భద్రత, బీమా లేకపోవడంతో ప్రమాదవశాత్తూ కార్మికులు మృతి చెందితే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

- వర్షాలతో నిండా గోతులమయం
- రాకపోకలకు వాహనదారుల ఇక్కట్లు
- నిధులు మంజూరైనా చేపట్టని పనులు
- ఇదీ సీలేరు, పాలగెడ్డ రహదారి దుస్థితి

నీరు నిండిన గోతులతో ప్రయాణసంకటంగా ఉన్న పాలగెడ్డ రహదారి

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు నుంచి పాలగెడ్డ వరకు ప్రధాన రహదారి నిండా గోతులమయం కావడంతో రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో రోడ్డు గోతుల్లో వర్షం నీరు చేరడంతో ఎక్కడ ఎంతపెద్ద గొయ్యి ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. సీలేరు నుంచి భద్రాచలం, రాజమండ్రి, విజయవాడ తదితర ప్రాంతాలతోపాటు ఒడిశా రాష్ట్రం మల్కనగిరి, చిత్రకొండ తదితర ప్రాంతాలకు బస్సుల రాకపోకలకు సాగిస్తుంటాయి. వీటిల్లో అనేకం నైట్‌సర్వీసులు కావడంతోపాటు ఆయా సర్వీసులన్నీ డీలక్స్‌లు, అల్ట్రా డీలక్స్‌లు కావడంతో పెద్దగోతులతో నిండిన ఈ మార్గంలో గోతుల్లో దిగడంతో బస్సులు బాడీలు నేలను అంటుతుండడంతో పాడవ్వడంతోపాటు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అంతేకాక ఇదే మార్గంలో ఎపిజెన్‌కో అధికారులు నిత్యం వాహనాల్లో సీలేరు మోతుగూడెం విధి నిర్వహణపై తిరుగుతుంటారు,

ఇటీవల పెంగాల్ తుఫాన్ కారణంగా అడపాదడపు వర్షాలు కురడంతో గోతుల్లో వర్షపునీరు చేరడంతో రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన గురవుతున్నారు.

రెండునెలల క్రితం తుపాన్, వరదలు ప్రభావంతో లంకపాక నుంచి సీలేరు వరకు రహదారులు కొట్టుకుపోయి అస్తవ్యస్తంగా తయారైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి నూతనంగా నిర్మాణానికి రూ.33 కోట్ల కేటాయించింది. విజయవాడ సెక్రటేరియట్ నుంచి ఇంజనీరింగ్ చీఫ్ అధికారులతోపాటు ఆర్‌అండ్‌బి అధికారులు బృందం రహదారి దుస్థితిపై పరిశీలన కూడా జరిపింది. ఈ మేరకు మంజూరైన నిధులతో. నవంబర్ నెలలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి డిసెంబర్ నుంచి రహదారి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. అయితే ఇప్పటివరకు ఎటువంటి పురోగతి లేకపోవడంతో రోడ్లు నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. రోజులు గడుస్తున్నా, రోడ్డు పునర్నిర్మాణం, పటిష్టపరిచే పనులు ప్రారంభించకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన గురవుతున్నారు. సీలేరు నుంచి పాలగడ్డ వరకు ప్రధాన రహదారిలో అధిక శాతంలో గోతులమయం కావడంతో ఆర్టీసీ బస్ సర్వీసులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని సిబ్బంది గగ్గోలు పెడుతుండగా, ఎక్కడ ఏ బస్సు నిలిచిపోతుందోనని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే ఆర్ వి నగర్ నుంచి పాలుగడ్డ వరకు గోతుల రోడ్డులో బీటీతో పునర్నిర్మాణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కెందును సన్మానిస్తున్న అధికారులు

కెందుకు సన్మానం

ప్రజాశక్తి - అరకులోయ:డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ సేవ రత్న అవార్డు గ్రహీత అరకులోయ మండలం రవ్వలగూడ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో పని చేస్తున్న ఆదర్శ ప్రధానోపాధ్యాయుడు హెచ్. పి.కెందుకి ఘనంగా సన్మానించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల్లో క్రమశిక్షణతో కూడిన విద్య అందించడం, సామాజిక సేవలో పాలి భాగస్తులు కావడం, పాఠశాల ప్రాంగణమంతా సొంత డబ్బులతో ఉద్యానవనాన్ని తలపించే విధంగా మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ పాటుపడటంతో అందరి మన్ననలు పొందుతున్న ప్రధానోపాధ్యాయుడు హెచ్. పి.కెందును అభినందిస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ కలయిక సందర్భాన్ని పురస్కరించుకొని అరకులోయ ఎంపీడీవో లవ రాజు, విద్యాశాఖ అధికారి వి.త్రినాథరావు, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు, ఆదివాసి పరిరక్షణ సమితి కన్వీనర్ చట్టు మోహన్, గిరిజన సంఘం నాయకులు బుజ్జి బాబులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాఠశాల ప్రాంగణమంతా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొందన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రావికమతం:సమస్యలను పరిష్కరించాలని రావికమతం మండల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నేతలు డిమాండ్ చేశారు. రావికమతం మండలం ఫీల్డ్ అసిస్టెంట్ల గౌరవాధ్యక్షులు దాసరి వరహాలు, మండల సంఘం అధ్యక్షుడు మచ్చ వెంకటరమణ (శ్రీను), కార్యదర్శి శెట్టి రాజకుమారిలు మాట్లాడుతూ, రావికమతం మండలంలో ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయి సిబ్బంది 28 పంచాయతీలలోను 26 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేస్తున్నారన్నారు. వీరిలో 2008 న సంవత్సరంలో నియామకమైన వారు సుమారు 20 మంది పనిచేస్తున్నారన్నారు. ఏన్నో ఏళ్లుగా ఇదే ఉద్యోగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ యూనియన్ అధ్యక్షులు గణేష్, మాజీ మండల కార్యదర్శి శ్రీను, సూరకాలా, సన్యాసిరావు, తదితరులు ఉన్నారు.

అసంపూర్తిగా పంచాయతీ భవనం

ప్రజాశక్తి - కోటవురట్ల: మండలంలోని కొడవటిపూడి గ్రామంలో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్యాలయం భవనం కోసం దాదాపు పది లక్షలు మంజూరు చేసింది. ఈ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ వ్యవస్థతో కొత్త భవనం మంజూరు కావడంతో పాత భవనాన్ని అలా అసంపూర్తిగా వదిలేశారు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లయన్స్ కేన్సర్ ఆసుపత్రికి విరాళం

ప్రజాశక్తి -సీతమ్మధార : సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న లయన్స్ కేన్సర్ జనరల్ ఆసుపత్రికి ఎయు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ రిటైర్డ్ ఉపాధ్యాయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన రూ.1,06,232 విరాళం అందించారు. ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ప్రొఫెసర్ వి.ఉమామహేశ్వరరావుకు అసోసియేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ కె.సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ కెవి.రావు, జాయింట్ సెక్రెటరీ ప్రొఫెసర్ ఎఆర్కె, ప్రొఫెసర్ డి.భారతి తదితరులు విరాళం అందించారు.

శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లు

శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

శిథిలావస్థలో పాఠశాల భవనం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని లైగండ పంచాయతీ పనసపుట్టు ఎలిమెంటరీ పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు. భవనం పైపెచ్చు గోడలు బీటలు బారింది. ఈ పాఠశాలలో 22 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. భవన గోడలు శిథిలావస్థకు చేరాయి. పాఠశాలలో మరుగుదొడ్ల సౌకర్యం లేదు. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉండి పూర్తిగా శిథిలవస్థకు చేరింది. భవనం మరమ్మతు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని మరమ్మతు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తూకాల్లో మోసాలను అరికట్టాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

తూకాలను పరిశీలిస్తున్న సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకువేలి మండలం సుంకరమెట్ట సంతల్లో బెట్టుకాటా తూకాల్లో మోసాలను అరికట్టాలని ఆదివారం ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. సంతల్లో అవకతవకలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జి బుజ్జిబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, నాయకులు మాట్లాడుతూ, సంతలో వ్యాపారస్థులు, దళారులు అమాయక గిరిజనులను ఆసరాగా చేసుకొని బెట్టు కాటా, ఎలక్ట్రికల్ కాటాలు పెట్టి తీవ్రంగా మోసం చేస్తున్నారన్నారు. దళారులు రైతుల నుండి కొనుగోలు చేసే సరుకులు మార్కెట్ ధరకు అనుకూలంగా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.సంతల్లో విక్రయిస్తున్న నాసిరకం నిత్యావసర వస్తువులను అరికట్టి గిరిజన ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా కాపాడాలని తెలిపారు. డిజిటల్ తూకల్లో అవకతవకాలు లేకుండా మండల మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సంబందిత అధికారులు ప్రతి సంతలో పర్యటించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీసీసీ అధికారులు ప్రతి సంత కేంద్రాల్లో ఉదయం 5 గంటల నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి దళారుల బారీన పడకుండా రైతుల నుండి నేరుగా సరుకులు, పప్పు దినుసులు కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో గిరిజన రైతులు పప్పు దినుసులకు మద్దత్తు ధర ప్రకటించి జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. లేకపోతే ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కె.రామారావు, కె.బుజ్జి బాబు, టి.జోషి, జి.సత్యారావు, టి.కృష్ణ, కె జయరాం, జి.రవి పాల్గొన్నారు.

బాక్సింగ్ టీమ్ కోచ్‌గా అబ్బు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: న్యూ ఢిల్లీలో జరుగనున్న నేషనల్ స్కూల్ గేమ్స్ అండర్ 17 బాక్సింగ్ టోర్నమెంట్ కు ఆంధ్రప్రదేశ్ టీమ్ కోచ్‌గా శాప్ కోచ్ అబ్బుని ఎంపిక చేసినట్లు ద్రోణాచర్య గ్రహీత కోచ్ ఐ. వేంకటేశ్వరావు తెలియజేశారు. ఈనెల 9నుండి 15 వరకు న్యూ ఢిల్లీలో ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ ఆటలకు స్థానిక శాప్ కోచ్ అబ్బు ఎంపిక అయ్యారు. ఇందులో భాగంగా ఆయనను నర్సీపట్నం నింజాస్ అకాడమీ, నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్స్ చైర్మన్ వెలగా నారాయణరావు అభినందిచారు. నర్సీపట్నంకు చెందిన ఎంతో మందిని నేషనల్, ఇంటర్నేషనల్ బాక్సర్లు తయారు చేసిన ఘనత అబ్బు దేనని పలువురు కొనియాడారు.

వృథాగా జల శుద్ధి యంత్రం

ప్రజాశక్తి -కోటవురట్ల

మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వంలో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన జలశుద్ధి యంత్రం ప్రస్తుతం వృధాగా పడి ఉంది. గత ఏడాది నుండి ఈ యంత్రం వృధాగా పడి ఉండడంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు.

ఇదే విషయం పట్ల సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులను వివరణ కోరగా అధికారులకు తెలియజేశామని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామ న్నారు. పాఠశాల విద్యాశాఖ కమిటీ అధ్యక్షులు చొరవ చూపి వినియోగంలోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

300 లీటర్ల సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-గొలుగొండ:ముందస్తు సమాచారం మేరకు గొలుగొండ మండలం చోద్యం గ్రామ శివారులో బొడ్డేరు గెడ్డ వద్ద సారా తయారీ స్థావరాలపై దాడులు చేపట్టినట్లు కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి నిల్వ ఉంచిన 300 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరం రహదారి అస్తవ్యస్తం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో అన్నవరం గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా చిద్రమైంది. దీంతో గడిచిన దశాబ్ద కాలంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంక్రాంతి నాటికి కూటమి ప్రభుత్వం గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తామని ప్రకటనలు చేసింది. అయితే ఇంతవరకు గ్రామానికి ఎటువంటి నిధులు కేటాయించక పోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు అదుపుతప్పి ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి, గత ప్రభుత్వంలో అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా రహదారి మంజూరు చేస్తారని అంతా ఆశగా ఎదురు చూశారు. ఈ రోడ్డుపై వేములపూడి వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

ఆలయానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలో ఎం.కోడూరులో మోదకొండమ్మ అమ్మవారి ముందు భాగం రహదారి పక్కన పాదముల నిర్మాణానికి జాజిమొగ్గల అప్పారావు సత్యవతి, సంజీవి మీనాక్షి దంపతులు శనివారం 10 వేలు విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్, ఎం కోడూరు గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శాస్త్రి పడాల అప్పల నాయుడు, చింతా వెంకట నారాయణమూర్తి, జగదీష్, గోపాల్, జొన్నపల్లి నాగరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : ఎన్నో ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఎక్కడో స్థిరపడిన వారంతా ఆత్మీయంగా కలుసుకున్నారు.1988-89 విద్యా సంవత్సరంలో కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయికను ఏర్పాటు చేశారు. ఒకరి నొకరు పరిచయం చేసుకున్న వారంతా ఆనందంగా గడిపారు.ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుటుంబాలలో పిల్లలకు తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు నిర్ణయించుకున్నారు. తమ ఉన్నతికి పునాదులు వేసిన పాఠశాల అబివృద్ధికి ఇతోధికంగా సహాయపడేందుకు నిర్ణయించుకున్నారు.

టిడిపి సభ్యత్వాల నమోదు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో పలు గ్రామాల్లోనూ చురుగ్గా టిడిపి సభ్యత్వాలు నమోదవుతున్నాయని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. నక్కపల్లిలో రాజీవ్ నగర్ కాలనీలో ఆదివారం వెంకటేష్ ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వాలు నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ అడ్డూరి లోవరాజు, అడ్డూరి శ్రీను, నాయకులు కొప్పిశెట్టి వీరబాబు, దేవరపు లోవరాజు, నడిగట్ల అప్పన్న, అడ్డూరి చిన్న, ధర్మయ్య పాల్గొన్నారు.

పోరాటం మరింత ఉధృతం

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటం మరింత ఉధృతం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 1396వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సిఐటియుకు చెందిన వివిధ విభాగాల కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు నమ్మి రమణ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వ్యతిరేక ఉద్యమం దేశవ్యాప్తంగా ఎంతో మందికి స్ఫూర్తి కలిగించిందన్నారు. పోస్టు కార్డుల ఉద్యమం సైతం 10 లక్షలకు చేరువకానుందని తెలిపారు.

నాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని సీతమ్మధారకు చెందిన 'నాట్యం' నాట్య కళాక్షేత్ర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 24వ వార్షికోత్సవం పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో అంగరంగ వైభంగా జరిగింది. నిర్వాహకులు, సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.మాధవి, నాట్యం నిర్వాహకులు వెంకట్ ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు చక్కటి తర్ఫీదునిచ్చి 'నాట్యాంజలి' పేరిట ఏర్పాటు చేసిన భరతనాట్య బృంద ప్రదర్శనలు అలరించాయి. వరంగల్లుకు చెందిన సుప్రసిద్ధ కూచిపూడి, భరతనాట్య నిపుణులు బి.సుధీర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంపటి చినసత్యం కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపల్ హరి రామ మూర్తి, ద డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకులు బత్తినరంగ విక్రమ్ కుమార్ (గౌడ్), సాంస్కృతికరంగ ప్రముఖులు కన్నం వెంకట రమణరావు, ఉమ్మిడి మహేష్ బాబు పాల్గొన్నారు. సీతా శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో భాగంగా సంస్థలో సంగీత, నృత్య శిక్షణ పొందినవారిలో 2023-24 విద్యా సంవత్సరానికిగాను అగ్రశ్రేణిలో నిలిచిన కొందరిని ఎంపిక చేసి సత్కరించారు. తెలుగు ఇండియన్ ఐడల్ పోటీలో రన్నరప్‌గా నిలిచిన జీవీ శ్రీ కీర్తికి గానగంధర్వ పురస్కారమందించారు.

గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం బ్రాంచి గుర్తింపు ఎన్నికల నోటిఫికేషన్ ఆదివారం సాయంత్రం విడుదలైంది. ప్రొఫెసర్ డాక్టర్ వివిఎస్.ప్రసాద్, కిముడు రామారావు, బాక సత్యారావు, ప్రొఫెసర్ డాక్టర్ కుడుముల వెంకటరమణమూర్తి, శోభ వెంకటరాజు నోటిఫికేషన్ విడుదల చేసిన వారిలో ఉన్నారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ నామినేషన్లను స్వీకరించనున్నారు. 12న నామినేషన్ పత్రాల పరిశీలన ఉంటుంది. 14న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుంది. అదే రోజు గుర్తులు, నామినేషన్లు ఖరారైన తర్వాత పోటీలో ఉన్న ప్యానల్‌కు ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి ఇవ్వనున్నారు. 22న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ ఓటింగ్ ప్రక్రియ ఉంటుంది. లెక్కింపు, ఫలితాలు అదే రోజున ఉంటాయి.

'రుషికొండ'ను రాష్ట్ర మ్యూజియంగా మార్చాలని వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని రుషికొండ ప్యాలెస్‌ను రాష్ట్ర మ్యూజియంగా మార్చాలని బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జనసేన జిల్లా అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.మల్లయ్య రాజు, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ విశాఖ జిల్లా బౌద్ధ చారిత్రక వారసత్వం కలిగిన ప్రాంతమని, జైన మతం ఆనవాళ్లు కూడా ఈ ప్రాంతంలో అనేకం ఉన్నాయని తెలిపారు.

ఘనంగా గ్రోత్ స్టోరీస్ అవార్డ్ సమ్మిట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ది సీకనెక్ట్స్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో గ్రోత్ స్టోరీస్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ - 2024 కార్యక్రమం నోవాటెల్ హోటల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో డిసెంబర్ మ్యాగజైన్ ఎడిషన్‌ను ఆవిష్కరించారు. ఇందులో పలు రంగాలకు చెందిన 30 కంపెనీలు, వ్యక్తుల విజయగాథలు ప్రచురితమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా విశాఖలో మొట్టమొదటిసారిగా రూపొందించిన, ఎలక్ట్రిక్ వాహన రంగంలో విప్లవం సృష్టించేదిగా పేర్కొంటున్న ఎలక్ట్రిక్ స్కూటర్ ధరతి బ్రోలిని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, కస్టమ్స్, సెంట్రల్ జిఎస్‌టి ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీధర్ ఆవిష్కరించారు.

మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఆరిలోవ పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభంలో హోం మంత్రి అనిత

ఆరిలోవ పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్రంలో పోలీసు శాఖలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యంగా కృషి చేస్తామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. హనుమంతువాక వద్దగల విమ్స్ ఆసుపత్రి వద్ద రూ 2.5 కోట్ల నిధులతో 17 గదులతో విశాలమైన ఆరిలోవ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని డిజిపి సిహెచ్.ద్వారకా తిరుమలరావులతో కలిసి ఆదివారం ఉదయం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖలో అత్యంత దయనీయ స్థితిలో ఉన్న పోలీస్ స్టేషన్ ఏదైనా ఉందంటే అది ఆరిలోవ పోలీస్ స్టేషన్ మాత్రమేనన్నారు. పోలీస్ శాఖను తిరిగి జీరో నుంచి ప్రారంభిస్తామన్నారు. తాజా భవనంలో ఎసిపి కార్యాలయం నిర్మాణం కోసం అదనపు అంతస్తు నిర్మాణానికి మరో రూ 2.5 కోట్ల నిధులు మంజూరు విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆరిలోవ నూతన పోలీస్ స్టేషన్ కోసం పోలీస్ శాఖ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ 40 లక్షలు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. అదేవిధంగా నూతన భవనం ఫర్నీచర్ కోసం సిఎస్ఆర్ నిధుల్లో రూ 16 లక్షలను విరాళంగా ఇచ్చిన దివీస్ లేబొరేటరీ యాజమాన్యాన్ని అభినందించారు. తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే రహదారి, బ్రిడ్జి నిర్మాణానికి జివిఎంసి నిధులు రూ.కోటి మంజూరుకు కమిషనర్‌తో మాట్లాడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, డిఐజి గోపీనాథ్ జెట్టి, సిపి శంఖబ్రత బాగ్చీ, డిసిపి - 1 అజిత్ వేజెండ్ల, ఎసిపి అన్నెపు నరసింహ మూర్తి, ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డెయిరీ అక్రమాలపై తొలి అడుగు

నేడు సభా సంఘం రాక

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విశాఖ డెయిరీ అవినీతి, అక్రమాలపై విచారణకు నియమించిన సభా సంఘం సోమవారం తొలిసారి డెయిరీని సందర్శించనుంది. సంఘం ఛైర్మన్, సీనియర్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, సభ్యులుగా నియమితులైన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, బొండా ఉమామహేశ్వరరావు, గౌతు శిరీష, ఆర్‌విఎస్‌కె.రంగారావు, దాట్ల సుబ్బరాజు ఉదయం 10.30 గంటలకు డెయిరీకి రానున్నారు. ఇక్కడ పరిశీలించిన తరువాత మధ్యాహ్నం 3 గంటలకు విశాఖపట్నం కలెక్టరేట్‌లో సమావేశం కానున్నారు. రెండు నెలల్లో నివేదిక సమర్పించాల్సివున్నందున తదుపరి విచారణపై చర్చించనున్నారు.

గతంలో వలె కాకుండా, సహకార రంగం నుంచి కంపెనీ యాక్టు కిందకు డెయిరీని తీసుకురావడానికిగల కారణాలతో పాటు ఆ క్రమంలో జరిగిన ఉల్లంఘనలు, ప్రస్తుతం డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందకుమార్ సహా పాలకవర్గం కూర్పు, పాల సేకరణ, రైతులకు డబ్బుల చెల్లింపు, పాల ఉత్పత్తుల తయారీ, అమ్మకం, ఆ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ, ఖర్చులు, రైతులు, ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన మిల్క్ ప్రొడ్యూసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఎడ్యుకేషన్, హెల్త్ అండ్ మెడికల్ వెల్ఫేర్ ట్రస్ట్ (ఎంపిఅండ్ఇఇహెచ్అండ్ఎండబ్ల్యు)కు వచ్చే ఆదాయం, దాని సేవలు, సంక్షేమం, వివిధ కార్యక్రమాలకు చేస్తున్న ఖర్చులపై మిల్క్, ఫైనాన్స్ ఆడిట్ నిర్వహిస్తే వాస్తవ సమాచారం తెలియనుంది. ఈ అక్రమాల్లో ఎవరి పాత్ర, భాగస్వామ్యం ఎంతనేది తేలనుంది. ప్రధాన సూత్రధారులూ బయటపడనున్నారు. ఎంతకాలం నుంచి పాల రైతుల సొమ్ము సొంతానికి వాడుకొని లబ్ధిపొందుతున్నారో, ఎప్పటి నుంచి ఎవరెవరు ఎలా ఆస్తులు కూడబెట్టుకున్నారో నిగ్గుతేలాలంటే నిష్ణాతులైన నిజాయతీకలిగిన వారి తోడ్పాటు సభా సంఘం తీసుకోవాల్సివుంది. రికార్డుల నిర్వహణలో ఆరితేరిన ఛైర్మన్, అందుకు సహకరిస్తున్న డెయిరీ ఎమ్‌డి, సహచర గణం నిధుల దుర్వినియోగం తేలాలంటే పదిహేనేళ్లుగా పాల సేకరణ, పాల పదార్థాల తయారీ, అమ్మకం, నిధుల జమ, ట్రస్టు కార్యకలాపాలపై సభా సంఘం ఆడిట్ నిర్వహించాల్సివుంది. రికార్డులోని జమ, ఖర్చుల పరిశీలనకు పరిమితం కాకుండా, నిధుల ఖర్చు, దాని వాస్తవి విలువ, ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో లోతుగా పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

బోనస్‌ను సొసైటీలకు జమచేసి, తిరిగి ఆ డబ్బును సేవా కార్యక్రమాల నిమిత్తం ట్రస్టుకు మళ్లించే ఏర్పాటు చేసుకొని, సొంతానికి ఆ డబ్బులు ఛైర్మన్ వినియోగించుకున్నారన్న బలమైన అభియోగాలున్నాయి. అయితే, ఎక్కడా తమ అవినీతి, నిధుల దుర్వినియోగం బయటపడకుండా రికార్డులు నిర్వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. డెయిరీ సొమ్ముతో రైతుల కోసం ఏర్పాటుచేసిన కృషి ఆస్పత్రిని కిమ్స్ ఆస్పత్రికి లీజుకు ఇవ్వడం, లీజు డబ్బులు ట్రస్ట్‌కు చేస్తున్న జమపైనా పరిశీలించాల్సివుంది. తాను, తన కుటుంబ సభ్యులు కొందరు లాభపడుతూనే, తనను ఏనాడూ ప్రశ్నించకుండా డైరెక్టర్లను మచ్చిక చేసుకున్నారన్న విమర్శలున్నాయి. అందుకు ప్రతిఫలంగా డైరెక్టర్లను డిస్ట్రిబ్యూటర్లుగా నమోదుచేసి పైసా పెట్టుబడి లేకుండా నెలకు కనీసంగా కమీషన్ రూపంలో ఐదు లక్షల ఆదాయం వచ్చే మార్గం వారికి చూపించారన్న ఆరోపణలు ఎంతోకాలంగా వున్నాయి. డెయిరీ జీతం తీసుకుంటున్న 108 ఉద్యోగులను ఛైర్మన్, డైరెక్టర్లు తమ సొంత పనులకు వినియోగించుకోవడం, కావాల్సిన ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి అందలమెక్కించడం, ప్రశ్నించే వారిని, నచ్చనివారిని బదిలీ చేయడం, ఇబ్బందులకు గురిజేయడం వంటివి కొనసాగుతున్నాయి. డెయిరీ అవినీతి, అక్రమ వ్యవహారాలపై లిఖితపూర్వకంగా ఆధారాలతో సహా ఇచ్చే ఫిర్యాదుల స్వీకరణకు విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లా సహా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరేట్లలో ప్రత్యేక కేంద్రాలను సభా సంఘం ఏర్పాటుచేస్తే అత్యధిక మంది వినియోగించుకొనే అవకాశముంది.

ఐ.పోలవరం పార్కు చెంతనున్న వాగులో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని పలు పర్యాటక ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో రద్దీగా కనిపించాయి. మండలంలోని ఐ.పోలవరం పార్కు, వెంకటేశ్వరస్వామి ఆలయం, సీతపల్లి బాపణమ్మ అమ్మవారి ఆలయం వద్ద పర్యాటకుల తాకిడికనిపించింది. ఉదయం నుండి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పర్యాటకులు, పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సందర్శనకు వచ్చి, ఆయా ప్రాంతాల్లో సందడి చేశారు. ఐ.పోలవరం పార్కు వద్ద వాగులో స్నానాలు చేస్తూ, అక్కడి ఆహ్లాదకరమైన పార్కులో సందడి చేశారు. రోడ్డుపై పర్యాటకుల వాహనాలు ఇరువైపులా నిలపడంతో భారీ వాహనాలు వచ్చే సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం దుర్మార్గం

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఆమె భర్త మఠం విజయభాస్కర్ పేర్లు చెప్పుకొని ఎటపాక మండలంలో కొందరు ఇసుక సరఫరాలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు నిరాధార ఆరోపణలతో కొందరు దుష్ప్రచారం చేయడం హేయమని తెలుగు కార్మిక సంఘం రంపచోడవరం ఉపాధ్యక్షులు సలాది బాపిరాజు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పెంటపాటి మోహన్ ఖండించారు. ఎమ్మెల్యే శిరీషాదేవికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూడలేకే కొందరు ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ముసురుమిల్లి బూత్ ఇంచార్జ్ కడబాల గణపతి రెడ్డి, ఈక బాపిరాజు ఉన్నారు.

వైభవంగా క్యుఎంబి చర్చి వజ్రోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రేసపువానిపాలెంలోని క్యుఎంబి చర్చి వజ్రోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు ఐజక్ మాట్లాడుతూ 1948 నుంచి నేటి వరకూ సంఘ పరిచర్యలు దినదిన ప్రవర్ధమానం చెందడంలో సహాయ సహకారాలందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కాటపల్లి ఇజ్రాయిల్, రెవరెండ్ డాక్టర్ జి.స్టీవెన్ పీటర్, పాస్టర్ చార్లీ మోజెస్, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో జర్నలిస్టులు కీలకం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎం.ప్రణవ్ గోపాల్ అన్నారు. ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్, ఎపి స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ విశాఖ యూనిట్ల ఆధ్వర్యంలో ఆదివారం శివాజీ పార్క్ యోగా కేంద్రంలో వన సమారాధన కార్యక్రమం చేపట్టారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందన్నారు. పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. విఎంఆర్‌డిఎ సందర్శనీయ ప్రాంతాల్లో పాత్రికేయుల పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పించే విషయమై కమిషనర్‌తో త్వరలో మాట్లాడతానన్నారు. గౌరవ అతిథిగా హాజరైన స్థితప్రజ్ఞ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వైవివి.సత్యనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులతోనే సమాజ ప్రగతి సాధ్యమన్నారు. సభకు అధ్యక్షత వహించిన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ నగర అధ్యక్షులు పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఏటా దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది వంటి ముఖ్యమైన పండగలతో పాటు వనసమారాధన కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. మౌనిక పట్నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అంబరాన్ని తాకాయి. కార్యక్రమంలో బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కె.మదన్, స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వివిఎస్.జగన్మోహన్, కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.